క్లుప్తంగా

పీఠంలో ప్రత్యేక పూజలు



సూర్య భగవానుడికి హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మాఘమాసం మూడో ఆదివారం పురస్కరించుకుని సూర్య భగవానునికి పూజాధికాలు చేశారు. పీఠం అర్చకుడు శివ ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు, వివిధ రకాల పుష్పాలతో అర్చనలు, అరుణ పారాయణం చేపట్టారు. అనంతరం సూర్య భగవానుడికి హోమం, పూర్ణాహుతి నిర్వహించిన అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడ్ని పూజించడం వలన ఆరోగ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, వియదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్య వెంకట కామేశ్వరి దంపతులు, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

భక్తాంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ పూజలు

కపిలేశ్వరపురం: నల్లూరులో భక్తులతో నూతనంగా నిర్మించిన భక్తాంజనేయస్వామి ఆలయంలో స్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులచే విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, వాస్తు పూజలు చేశారు. స్వామి శిలా విగ్రహానికి అభిషేకం చేశారు. గ్రామోత్సవం నిర్వహించారు. భక్తాంజనేయస్వామి, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాలను సోమవారం ఆలయంలో ప్రతిష్ఠించనున్నట్టు తెలిపారు. అనంతరం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

రావులపాలెం: పొడగట్లపల్లికి చెందిన చిలకమర్తి మౌనిక స్థానిక సత్యసాయి జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుంది. తండ్రి మరణించడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మౌనికకు స్థానిక వాసవీ క్లబ్ అధ్యక్షుడు పులవర్తి గోపాలకృష్ణమూర్తి ట్రస్ట్ ద్వారా రూ.6 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. విద్యార్థిని చదువు కోసం ఈ సాయాన్ని చేసినట్టు తెలిపారు.

రాష్ట్ర దేవాంగ సంఘ కార్యదర్శిగా జగదీష్

మామిడికుదురు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం కార్యదర్శిగా మొగలికుదురుకు చెందిన కొండా జగదీష్ ఎన్నికయ్యారు. సంఘ సమావేశం ఆదివారం విజయవాడలో జరిగింది. సంఘ చేనేత విభాగం ఉపాధ్యక్షులుగా అదే గ్రామానికి చెందిన గుంటు వీర వెంకట సత్యనారాయణ, రాష్ట్ర యూత్ విభాగం ఉపాధ్యక్షునిగా కారుపర్తి షణ్ముక సాయికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

రేపు సాగునీరు విడుదల

కొత్తపేట: ప్రస్తుత రబీ (దాళ్వా) పంటకు వంతుల వారీగా సాగునీటి సరఫరా విధానం అమలులో భాగంగా మండలంలోని వాడపాలెం లాకుపై ఉన్న చానళ్లకు మంగళవారం సాగునీరు సరఫరా చేస్తున్నట్టు ఇరిగేషన్ శాఖ స్థానిక సెక్షన్ ఏఈ వి.నవీన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బొబ్బర్లంక–ముక్తేశ్వరం ప్రధాన పంట కాలువ ద్వారా మండలంలోని వాడపాలెం లాకులపైన గత వాడపాలెం ఓల్డ్, న్యూ చానల్స్‌కు మంగళవారం ఉదయం 6 గంటల నుంచి బుధవారం ఉదయం 6 గంటల వరకూ 24 గంటల పాటు సాగునీరు సరఫరా చేయనున్నట్టు ఏఈ తెలిపారు. ఆయా చానళ్ల కింద కొత్తపేట, వాడపాలెం, బిళ్లకుర్రు గ్రామాల పరిధిలోని వరి ఆయకట్టుకు సంబంధించిన రైతులు వంతుల వారీ విధానంలో తమ భూములకు సాగునీరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడి బంధువుకు చెక్కు అందిస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.13 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. రాజోలు మండలం పొదలాడ గ్రామానికి చెందిన 30 ఏళ్ల కల్యాణం గౌరీప్రసాద్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి రెండు కిడ్నీలు పాడైపోవడంతో, కిడ్నీ మార్పిడి జరగాలని వైద్యులు తెలిపారు. అతడి తల్లి కిడ్నీ ఇవ్వడంతో నెల రోజుల క్రితం కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేశారు. అనంతరం మూడు నెలల కాలంలో ఇన్ఫెక్షన్ రాకుండా చేసే ఇంజెక్షన్‌కు రూ.లక్ష వరకు ఖర్చవుతుంది. దాతల సాయం, కొంత అప్పు చేసి రూ.5 లక్షల వరకు ఖర్చు పెట్టారు. బాధితుడి బంధువుల విజ్ఞప్తి మేరకు సంస్థ సభ్యులు బాధితుడి మేనల్లుడు ఇంగువ నాగప్రసాద్‌కు చెక్కును అందజేశారు.

మందుబాబులం.. మత్తుకు బానిసలం..!

- కూటమి పాలనలో రెచ్చిపోతున్న మందుబాబులు
- బహిరంగ ప్రదేశాలను బార్లుగా మారుస్తున్న వైనం
- రాత్రి సమయాల్లో బైకులతో రహదారులపై చక్కర్లు
- మహిళలు, బాలికలకు రక్షణ కరవు
- బహిరంగ బారుగా మారిన కృత్తివెంటి మైదానం
- చోద్యం చూస్తున్న పోలీసు యంత్రాంగం



కృత్తివెంటి గ్రౌండ్‌లో మందుబాబులు తాగి పడేసిన బీరు బాటిళ్లు

రామచంద్రపురం: 'కూటమి ప్రభుత్వం ఏర్పడితే అందరికీ కారుచౌకగా మద్యం అందిస్తాం.. పనికెళ్లి వచ్చాక రోజూ ఓ పెగ్గేసి పడుకోవచ్చు' గత ఏడాది ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన నాయకులు ఇచ్చిన హామీలు ఇవి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మద్యం కారుచౌకగా దొరకటం మాట అటుంచితే మందుబాబులకు కనిపించే ప్రతి ప్రదేశం బహిరంగ బారుల్లా మారిపోతున్నాయి. మద్యం దుకాణాలు తెరిచేందుకు వేళాపాళా లేకుండా పోయింది. ఎక్కడ పడితే అక్కడ ఇష్టారాజ్యంగా మద్యం తాగుతూ మందుబాబులు వీరంగం చేస్తున్నా అటు పోలీసులు గానీ, ఇటు ఎక్సైజ్ శాఖ అధికారులు గానీ కిక్కుమనకుండా మిన్నకుంటున్నారు. పట్టణంలో ఎంతో ప్రసిద్ధి గాంచిన కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణం సైతం మందుబాబులకు అడ్డాగా మారింది. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వందలాది మంది గ్రౌండ్‌కు వస్తుంటారు. పిల్లలు, పెద్దలు, మహిళలు తెల్లవారుజాము నుంచి సాయంత్రం 9 గంటల వరకు గ్రౌండ్‌కు వస్తూనే ఉంటారు. వాకింగ్ చేసేవాళ్లు, బాస్కెట్ బాల్ క్రీడాకారులు, వివిధ క్రీడలు అభ్యసించే విద్యార్థులు ఇలా ఒకరేమిటి.. అందరికీ ఎంతో అనువుగా ఉండే మైదానమిది. రాత్రి అయితే చాలు మందుబాబులకు అడ్డాగా మారుతోంది. రాత్రి వేళల్లో మందుబాబులు గ్రౌండ్‌కు చేరుకొని పూటుగా తాగేసి సీసాలు అక్కడే పడేసి వెళ్లిపోతున్నారు. తెల్లవారు జామున వాకింగ్‌కు వచ్చే వారికి తాగి పడేసిన మద్యం బాటిళ్లు ట్రాక్‌లో దర్శనమిస్తున్నాయి. చీకటిలో వాటిని దాటుకుని వెళ్లేందుకు వాకర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గతంలో ఇలా..

గత వైఎస్సార్ సీపీ పాలనలో సాయంత్రం అయితే పోలీసు వాహనం రౌండ్లు వేసేది. బహిరంగ ప్రదేశాల్లో గానీ, ఇతర ఖాళీ స్థలాల్లో గానీ మద్యం సేవిస్తే అరెస్టులు చేసి కౌన్సెలింగ్ ఇచ్చేవారు. రాత్రి 9 గంటలు దాటితే మద్యం షాపులు మూసి ఉండేవి. రాత్రి 10 గంటల తరువాత పట్టణంలో బ్రీత్ ఎన్‌లైజర్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టి మద్యం తాగి వాహనాలు నడపకుండా అరికట్టేవారు. కానీ నేడు ఇవేమీ కానరావటం లేదు.

వేళాపాళా లేదు

మద్యం షాపులు తెరుచుకొనేందుకు వేళాపాళా లేకుండా పోయింది. ఉదయం 7 గంటలకే షాపులు తెరిచేస్తున్నారు. రాత్రి 11 గంటలు దాటినా మద్యం విక్రయిస్తునే ఉన్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత షాపులు మూసేస్తున్నా.. బ్యాక్‌డోర్ నుంచి తెల్లవార్లు డెలివరీ చేస్తునే ఉంటున్నారు. దీంతో మందుబాబులు ఎక్కడ పడితే అక్కడ మద్యం సేవిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

ఎక్కడ చూసినా మద్యం బాటిళ్లే

రాత్రి వేళల్లో ఖాళీగా ఉండే ప్రాంతాలన్నీ మద్యం బాటిళ్లతో నిండిపోతున్నాయి. మద్యం షాపుల వద్ద మద్యం కొనుగోలు చేసి పక్కనే ఇళ్ల మధ్యలో ఉండే ఖాళీ స్థలాల్లో మద్యం సేవిస్తూ మందుబాబులు వీరంగం చేస్తున్నారు. అర్ధరాత్రి సమయాల్లో మద్యం సేవించి మోటారు సైకిళ్లపై వీరంగం సృష్టిస్తూ రోడ్డుపై వెళ్లే వారికి చుక్కలు చూపిస్తున్నారు. ఇలా అర్ధరాత్రి వేళల్లో రోడ్ల మీద తిరుగుతూ ప్రమాదాలకు గురైన వారు ఉన్నారు. ఇలాంటి కేసులను సైతం పోలీసులు దాచి పెడుతూ చాటుమాటున సెటిల్‌మెంట్‌లు సైతం చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసులు, ఇతర శాఖల అధికారులు స్పందించి మందుబాబుల వీరంగాన్ని అరికట్టాలని పట్టణ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పోలీసులు చర్యలు తీసుకోవాలి



నిత్యం వందలాది మంది వచ్చే గ్రౌండ్‌లో కొందరు మద్యం సేవించి క్రీడా ప్రాంగణాన్ని పాడు చేస్తున్నారు. రాత్రి వేళల్లో తాగేసి ఎక్కడ పడితే అక్కడ సీసాలు వదిలేసి వెళ్లిపోతున్నారు. తెల్లవారు జామున వచ్చే వాకర్స్ చాలా ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు వెంటనే చర్యలు తీసుకుని మందుబాబుల వీరంగాన్ని అరికట్టాలి.

తొగరు మూర్తి, వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు, రామచంద్రపురం.

నిఘా పెంచుతాం



క్రీడా ప్రాంగణంలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీసు సిబ్బందితో అన్ని చోట్లా గట్టి నిఘా ఏర్పాటు చేస్తాం. నిర్జన ప్రాంతాల్లో మద్యం సేవించకుండా ఉండేందుకు పటిష్ఠ చర్యలు అమలు చేస్తాం.

నాగేశ్వరరావు, ఎస్సై, రామచంద్రపురం.

చువ్వ దిగిందా.. ప్రాణం గోవిందా!



కాకినాడ-కోటిపల్లి రహదారిలో రక్షణ ఏర్పాట్లు లేకుండా ఇనుప ఊసలతో వెళుతున్న మినీవ్యాను

- రక్షణ ఏర్పాట్లు లేకుండా మినీ వాహనాలపై ఇనుప ఊసల తరలింపు
- నిబంధనలకు వాహనదారుల తిలోదకాలు

కాజులూరు: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రయాణికులు నిబంధనలను కచ్చితంగా పాటించాలంటూ రవాణాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా వాహన చోదకులు వాటిని లక్ష్య పెట్టడం లేదు. పరిమితికి మించిన లోడుతో వాహనాలను రహదారులపై పరుగులు పెట్టిస్తూ ప్రమాదాలకు ఆజ్యం పోస్తున్నారు. ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రహదారులలో సైతం అధిక బరువుతో కూడిన ఇనుప ఊసలను మినీ వ్యాన్లు, ట్రాక్టర్లపై రవాణా చేస్తున్న దృశ్యాలు అధికంగా కనిపిస్తున్నాయి. గృహ నిర్మాణలకు వినియోగించే ఇనుప ఊసలను వాటి సైజుకు అనుగుణంగా లారీలపై తరలించాలి. రవాణా చార్జీలు తగ్గించుకునేందుకు వీటిని మినీ వ్యాన్లు, ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. అయితే రవాణా సమయంలో వాహనదారులు సరైన జాగ్రత్తలు పాటించకపోవటంతో అది తోటి ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారుతుంది. వ్యాన్లు, ట్రాక్టర్లపై నుంచి ఊసలు క్రిందికి వ్రేలాడుతూ ప్రమాద భరితంగా దర్శనమిస్తున్నాయి. ఈ వాహనాలకు వెనుక వచ్చేవారు ఏమాత్రం ఆదమరిచినా ప్రాణాలు గాలిలో కలవడం ఖాయం.

క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్ విజేత తోటపేట



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సర్పంచ్ సతీష్‌రావు, బేబీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో గత 15 రోజులుగా నిర్వహిస్తున్న జై భీమ్ ఫ్రెండ్స్ సర్కిల్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేతగా రామచంద్రపురం మండలం తోటపేట గ్రామం జట్టు నిలిచింది. ఆదివారం కె.గంగవరం అముజూరు జట్టు, తోటపేట జట్టు ఫైనల్ మ్యాచ్‌లో తలపడ్డాయి. ఫైనల్ మ్యాచ్‌లో విజేతగా నిలిచిన తోటపేట జట్టు కెప్టెన్ నీలం ప్రసాద్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. విజేతలకు గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, మాజీ సర్పంచ్ గొల్లపల్లి పార్వతి కుమార్తె బేబీల చేతుల మీదుగా ట్రోఫీని అందజేశారు. విన్నర్స్‌కు రూ.10 వేలు, రన్నర్స్‌కు రూ.5 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన పులిదిండి ప్రసాద్, జై భీమ్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొల్లపల్లి పార్వతి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉంగరాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అప్పుడే భగభగ



ఎండ తీవ్రతకు చీర కొంగులను తలపై వేసుకుని వెళుతున్న మహిళలు

- ముందే పెరుగుతున్న ఎండలు
- 37 డిగ్రీలకు చేరుకున్న గరిష్ట ఉష్ణోగ్రతలు
- పెరుగుతున్న విద్యుత్ వినియోగం

రాయవరం: ఓ వైపు చలికాలం ముగియనేలేదు. మరో వైపు అప్పుడే ఎండలు భగభగ మండుతున్నాయి. వారం రోజులుగా కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. గత నెలలో కనిష్ట ఉష్ణోగ్రత 15 డిగ్రీల లోపు, గరిష్ట ఉష్ణోగ్రతలు 26 నుంచి 30 డిగ్రీల వరకు నమోదు కాగా.. ప్రస్తుతం కనిష్ట ఉష్ణోగ్రతలు 26 డిగ్రీల నుంచి 37 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. భానుడి భగభగల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎండలతో ప్రధాన కూడళ్లు జన సంచారం లేక వెలవెలబోతున్నాయి. వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం పుచ్చకాయలు, దోసకాయలు, జ్యూస్‌లు, కూల్ డ్రింక్స్ తదితర శీతల పానీయాల దుకాణాలు వెలుస్తున్నాయి. ప్రజలు దాహార్తిని తీర్చుకునేందుకు వాటిని ఆశ్రయిస్తున్నారు.

పెరుగుతున్న ఎండలకు ఇన్నాళ్లు మూలకు చేరిన కూలర్లు, ఏసీలు వినియోగంలోకి తెస్తున్నారు. రబీ పంటల నీటి తడులకు రైతులు విద్యుత్ మోటార్లను వినియోగిస్తున్నారు. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగి విద్యుత్ వినియోగం పెరిగే అవకాశముంది. ఎండలు పెరగడంతో పాటు, ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గతేడాది మే నెలలో గరిష్ట ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల వరకు చేరాయి. ఈ ఏడాది కూడా వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశముంటుందని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు తగ్గుముఖం

కాకినాడ ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్



కోలంకలో స్థానికులను విచారిస్తున్న కాకినాడ ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్

కాజులూరు: గ్రామాలలో ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవటం ద్వారా నేరాలను అదుపు చేయొచ్చని కాకినాడ ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ అన్నారు. మండలంలోని కోలంకలో ఇటీవల జరిగిన చోరీలపై ఏఎస్పీ గ్రామంలో పర్యటించి విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. వ్యాపారులు తమ వంతు బాధ్యతగా ప్రతి షాపు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. గ్రామంలో అనుమానాస్పదంగా సంచరించేవారి కదలికలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కాకినాడ రూరల్ సీఐ కృష్ణచైతన్య, గొల్లపాలెం ఎస్సై మోహన్‌కుమార్ సంఘటనా స్థలాలను పరిశీలించి బాధితుల ద్వారా దొంగతనాలు జరిగిన తీరును తెలుసుకున్నారు.

నేత్రానందంగా షిరిడీ సాయిబాబా పల్లకీ ఊరేగింపు



పల్లకీలో ఊరేగుతున్న బాబా



ప్రత్యేక అలంకరణలో హసన్‌బాద షిరిడీ సాయిబాబా

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో వేంచేసి యున్న 130 అడుగుల కల్యాణ సాయి మందిరం వద్ద ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం 5 కోట్ల సాయి నామాలతో ఊరేగింపు నిర్వహించారు. సాయికోటి పుస్తకాలతో ద్రాక్షారామ వరకు ప్రధాన రహదారిపై షిరిడీ సాయిబాబా పల్లకీ ఊరేగింపు నేత్రానందంగా సాగింది. అనంతరం 12 గంటల పాటు ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి నామజపంతో అఖండ సాయి నామ సంకీర్తన నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు పుష్పాభిషేకం, అమ్ముల సాంబశివరావు గురూజీ సత్సంగ ప్రసంగం, రాత్రి సాయికథ గాన రూప ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సాయి సేవకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నగరం గ్రామాన్ని దత్తత తీసుకోవాలి

మామిడికుదురు: కృష్ణా–గోదావరి బేసిన్‌లో ఉన్న అపార చమురు, సహజ వాయువు నిక్షేపాలను ఓఎన్జీసీ, గెయిల్, గుజరాత్ పెట్రోలియం కార్పొరేషన్, రిలయన్స్ సంస్థలు తరలించుకుపోతున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం నగరం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చమురు సంస్థలు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నాయని దుయ్యబట్టారు. ఇక్కడి చమురు, ఖనిజాలు, సహజ వనరులపై లభించే ఆదాయంలో న్యాయమైన వాటా ఈ ప్రాంత ప్రజలకు దక్కాలన్నారు. 2014లో నగరంలో జరిగిన గ్యాస్ విస్ఫోటంలో 22 మంది మరణించడమే కాకుండా, ఈ ప్రాంతమంతా కాలిబూడిదైందన్నారు. రైతులకు, ప్రజలకు తీవ్రమైన నష్టం జరిగిందని, బాధితులకు పూర్తి న్యాయం జరగలేదన్నారు. నగరం గ్రామాన్ని దత్తత తీసుకుంటామని, వంద పడకల ఆస్పత్రిని నిర్మిస్తామని చమురు సంస్థ హామీ ఇచ్చినట్టు గుర్తు చేశారు. ఆ హామీలు ఇంతవరకు నెరవేరలేదన్నారు. రైతుల పొలాల్లో వేసిన పైపులైన్లకు కౌలు కూడా ఇవ్వకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వనరులపై రాష్ట్ర ప్రజల హక్కులను కాపాడాలని కోరుతూ ఈ నెల 23న కాకినాడ గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన సదస్సుకు పెద్దఎత్తున బాధితులు, రైతులు తరలి రావాలని కోరారు.

నిత్య కల్యాణం.. పచ్చతోరణం

- వాడపల్లి క్షేత్రానికి తరలివస్తున్న భక్తజనం
- అష్టోత్తర పూజలో పాల్గొన్న భక్తులు



వాడపల్లి క్షేత్రంలో కూచిపూడి నృత్య ప్రదర్శన



వాడపల్లి ఆలయంలో అష్టోత్తర పూజలో పాల్గొన్న భక్తులు



దేవదాయ శాఖ జేసీ త్రినాథరావుకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అధికారులు, అర్చకులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రం నిత్య కల్యాణం పచ్చతోరణంలా తిరుమల క్షేత్రాన్ని తలపిస్తోంది. అశేష భక్తజనం తరలిరావడంతో ఇది కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందింది. శనివారం రాష్ట్ర నలుమూలల నుంచి విశేష సంఖ్యలో భక్తులు తరలివస్తుండగా, మిగిలిన రోజులు కూడా అత్యధికంగా భక్తజనం తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. వారితో పాటు ఏడు వారాల నోము పూర్తి చేసుకున్న భక్తులు అష్టోత్తర పూజలు జరిపిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం వాడపల్లి క్షేత్రానికి భక్తులు తరలివచ్చి, అష్టోత్తర పూజలో పాల్గొని, స్వామిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో సిబ్బంది భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు. వేంకటేశ్వరస్వామిని దేవదాయ, ధర్మాదాయ శాఖ జాయింట్ కమిషనర్, సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం దేవస్థానం అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికి, పూజాదికాల అనంతరం వేదాశీర్వచనం, అనంతరం స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ప్రతి శనివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో ధర్మపథం కార్యక్రమంలో భాగంగా కాకినాడ, అమలాపురం నాట్యాలయ బృందం వారు నిర్వహించిన ఉమా సోమేశ్వర కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా అలరించింది.

నూకాంబికా జాతరకు అంకురార్పణ



అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న ఈఓ తదితరులు

ఆలమూరు: ప్రసిద్ధి చెందిన చింతలూరు నూకాంబికా అమ్మవారి తీర్థ, జాతర మహోత్సవాలకు ఆదివారం అంకురార్పణ జరిగింది. ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు చౌదరి పర్యవేక్షణలో మార్చి 28న ప్రారంభమయ్యే జాతర మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారిని అంకురార్పణ పూజలతో ఉత్సవాల ప్రక్రియను ప్రారంభించారు. అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాట్లు చేసుకునేందుకు వీలుగా ఏటా ఒకటిన్నర నెలల ముందు విఘ్నేశ్వర పూజను చేసి అమ్మవారి ఉత్సవాలకు పనులు ప్రారంభించినట్లు ఈఓ తెలిపారు. మార్చి ఒకటి నుంచి 12 వరకూ మండలంలోని వివిధ గ్రామాల్లో అమ్మవారు బుట్ట గరగ రూపంలో ప్రజలకు దర్శనమివ్వనున్నారు. 13 నుంచి 28 వరకూ ప్రతి రోజు రాత్రి మన్యం నుంచి తీసుకువచ్చిన మోదుకుపూలతో తయారు చేసిన గరగతో జాతరలను నిర్వహిస్తారు. మార్చి 28న పెద్ద జాగరణ, 29న తీర్థం, 30న ఉగాది పర్వదినాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వైట్ల శేషుబాబు, సాగునీటి సంఘం చైర్మన్ వైట్ల గంగరాజు, వైట్ల చినఅబ్బు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో ప్రశాంతత

అయినవిల్లి: భక్తులకు భగవద్గీత పఠనం వల్ల మనస్సు ప్రశాంతంగా ఉంటుందని అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్ దాస్ ప్రభుజీ అన్నారు. ఆదివారం నల్లచెరువు గ్రామంలో అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిరంలో విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. భక్తులు స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు.

గల్ఫ్ యువ నేస్తం సేవలు అభినందనీయం

మలికిపురం: గల్ఫ్ యువ నేస్తం సేవా సమితి సేవలు అభినందనీయని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, నెడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ పాటి శివకుమార్ అన్నారు. అనారోగ్యంతో ఉన్న శంకరగుప్తం గ్రామానికి చెందిన కడలి పెద్దిరాజుకు వైద్యం కోసం సమితి సభ్యులు రూ.20 వేలు సమకూర్చారు. పాటి శివకుమార్ ఇచ్చిన రూ.1,500తో కలిపి బాధితునికి ఆదివారం గ్రామంలో అందించారు. కార్యక్రమంలో కడలి సత్యనారాయణ, కాండ్రేగుల రమేష్, కడలి బాలకృష్ణ, గ్రూప్ సభ్యులు గుబ్బల గోవర్ధన పద్మకుమారి, కడలి కృష్ణార్జునుడు, దొంగ సత్తిబాబు, కట్టా వాసు, గుబ్బల రామకృష్ణ, కండిబోయిన రమేష్, కాండ్రేగుల లక్ష్మీనరసింహమూర్తి పాల్గొన్నారు.

సీహెచ్‌సీకి రూ.1.02 లక్షల సామగ్రి అందజేత



సీహెచ్‌సీకి సామగ్రి అందిస్తున్న భీమాల

పి.గన్నవరం: అబ్దుల్ కలాం ట్రస్టు చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి దాతల సహకారంతో ఆదివారం రూ.1.02 లక్షల విలువైన సామగ్రి అందజేశారు. రెండు స్టీలు కుర్చీలు, రెండు టీవీలు, 100 దుప్పట్లు, 10 ఫ్యాన్లు తదితర సామగ్రిని హెడ్ నర్సు జి.అనంత లక్ష్మీకుమారికి భీమాల అందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యుడు గూటం శ్రీనివాసరావు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.